క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి చెక్కు అందిస్తున్న బంగార్రాజు

భోగాపురం: మండలంలోని పోలిపల్లిలో బాధిత కుటుంబానికి మంజూరైన సీఎంఆర్ ఎఫ్(ముఖ్యమంత్రి సహాయ నిధి) చెక్కును ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు శనివారం అందజేశారు. గొంప సత్యవతి అనే మహిళ అనారోగ్యం బారినపడడంతో చికిత్స ఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారని, రూ.1.18 లక్షలు మంజూ రయ్యాయని ఆయన తెలిపారు.

వర్షపునీటి నిల్వల నిర్మాణాలకు చర్యలు



నీటి నిల్వల కోసం నిర్మాణం చేస్తున్న దృశ్యం

విజయనగరం: భారత గృహ నిర్మాణ, పట్టణా భివృద్ధి వ్యవహారాల మంత్రిత్వ శాఖ సూచన లతో వర్షపు నీటి నిల్వల నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నామని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. నగరంలో వర్షపునీటి నిల్వలకు చేస్తున్న చర్యలను ఆయన శనివారం పరిశీలించి, మాట్లాడారు. షాలో అక్విఫైర్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు కింద కేంద్రం నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు 10 ప్రాంతాల్లో ఈ తరహా నిర్మాణాలు చేపట్టాలని సూచించడం జరిగింద ని, ఈ మేరకు నిర్మాణాలు చేపడుతున్నామ న్నారు. ప్రస్తుతం గాజులరేగ, జొన్నగుడ్డి ప్రాం తాల్లో వర్షపునీటి నిల్వల కోసం చేసిన నిర్మాణ పనులను ప్రారంభించామన్నారు.

రక్తహీనత నివారణే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: గర్భిణుల్లో రక్తహీనత నివారణే లక్ష్యంగా పనిచేయాలని డీఎంహెచ్ వో ఎస్.జీవనరాణి సూచించారు. జిల్లా వైద్యా రోగ్య శాఖ కార్యాలయంలో ఏప్రిల్, మే నెలల్లో సంభవించిన మాతా శిశు మరణాలపై శని వారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్లు ఎక్కిం చాలని తెలిపారు. ఐరన్ సమృద్ధిగా ఉన్న ఆహారం ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో ఉం డేలా చూసుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో డీఐవో అచ్యుతకుమా రి, డీసీహెచ్ఎస్ పద్మశ్రీరాణి, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వాన్ని ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న ఐఆర్ఎస్ అధికారి రవికిరణ్

విజయనగరం అర్బన్: మారుతున్న జీవన పరి ణామంలో ఎదురయ్యే విపత్కర పరిస్థితులను తట్టుకుని జీవించేలా విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని ప్రోత్సహించాలని ఐఆర్ఎస్ అధికారి ఈదర రవికిరణ్ అన్నారు. శనివారం స్థానిక గురజాడ పాఠశాలలో '21వ శతాబ్దంలో విద్యా ర్థులకు కావాల్సిన జీవన నైపుణ్యాలు' అనే అం శంపై ప్రసంగించారు. విద్యార్థులు, తల్లిదండ్రు లతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఇది కృత్రిమ మేధా కాలమని, వట్టి జ్ఞాపకశ క్తికి, బట్టీ చదువుకు చోటే లేదన్నారు. మార్కులు, ర్యాంకుల గోల తగ్గాలన్నారు. పిల్లలకు ఇష్టమైన విషయాలు నేర్చుకునేం దుకు అవకాశం కల్పించాలని, వారికి నచ్చిన రంగంలో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ, ప్రధానోపాధ్యాయుడు శేఖర్ పాల్గొన్నారు.

జూలై 9న దేశవ్యాప్త సమ్మె



సీడీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గజపతినగరం: వచ్చే నెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్, మినీ వర్కర్లు పాల్గొం టున్నారని అంగన్‌వాడీ వర్కర్ల అధ్యక్షురాలు సుభాషిని తెలిపారు. ఈ మేరకు సీడీపీఓ ఎం. రాజేశ్వరిని శనివారం కలిసి వినతిపత్రం అంద జేశారు. అనంతరం సుభాషిని విలేకరులతో మాట్లాడుతూ.. బీజేపీ మూడోసారి అధికారం లోకి వచ్చిన తర్వాత 42 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువ చ్చిందని, వెంటనే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనంగా రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వై.నారాయణమ్మ, టి.త్రివేణి, సన్యాసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లోడు క్రమబద్ధీకరణ..

రెండు రోజులే గడువు!

- అదనపు లోడు క్రమబద్ధీకరణకు ముగుస్తున్న గడువు
- 50 శాతం రాయితీ ప్రకటించిన విద్యుత్ శాఖ
- ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకుంటేనే సబ్సిడీ



విజయనగరం: విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీక రణకు ఇచ్చిన గడువు ముగుస్తోంది. సరిగ్గా రెండు నెలల క్రితం ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదా రులకు విద్యుత్ శాఖ కల్పించగా, మరో రెండు రోజులే గడువు ఉండడంతో ఎవరైనా దరఖాస్తు చేసుకోకపోతే చేసుకోవాలని అధికారులు సూచిస్తు న్నారు. అదనపు లోడు భారంతో బాధపడుతున్న వారంతా ఈ అవకాశం వినియోగించుకుంటే అద నపు చార్జీల బెడద ఉండదని సలహా ఇస్తున్నారు. విజయనగరం కార్పొరేషన్ పరిధిలో డి1, డి2, డి3, డి4,డి5 సబ్‌స్టేషన్ల పరిధిలో 1.30లక్షలకు పైగా కనె క్షన్లు ఉన్నట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. అయితే వీటి పరిధిలోని వినియోగదారుల్లో 50 శాతానికి మించి కనెక్షన్ తీసుకున్న సమయంలో చూపించిన వినియోగం కన్నా ఇప్పుడు అధికంగానే విద్యుత్ వాడుతున్నారు. ఈ నేపథ్యంలో వారికి ఉప శమనం కలిగించేందుకు అదనపు లోడు క్రమబద్ధీ కరణకు దరఖాస్తులు ఆహ్వానించగా, కేవలం 1247 దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు సమాచారం.

పెరుగుతున్న వినియోగం..

రోజురోజుకూ విద్యుత్ వినియోగం పెరిగిపోతోం ది. సాధారణంగా కనెక్షన్ ఇచ్చేటప్పుడు కిలో వాట్ విద్యుత్ వినియోగానికి గృహాలకు రూ.2 వేలు, దుకాణాలకు రూ.2,500ల చొప్పున వసూలు చేస్తారు. చాలామంది గృహ వినియోగదారులు ఈ మొత్తానికి సంబంధించి ఒకటి నుంచి రెండు కిలో వాట్ లోపలే చూపిస్తారు. వినియోగంలో అంతకు రెట్టింపు కేటగిరీలో చేరిపోతున్నారు. వాణిజ్య కనెక్ష న్లకు సంబంధించిన వినియోగమైతే చూపించిన దానికన్నా ఏకంగా నాలుగింతలు ఉంటోంది. ఇటు వంటి వారంతా అదనపు లోడు క్రమబద్ధీకరణ చేసుకోవాల్సిన అవసరం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలి..

ప్రతి అదనపు కిలో వాట్‌కు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.200గా నిర్ణయించారు. ఇదే సమయంలో డెవ లప్‌మెంట్ చార్జీ రూ.1500 చెల్లించాల్సి ఉంటుంది. కిలోవాట్‌లు పెరిగే కొద్దీ ఈ రుసుం మారుతుంది. దరఖాస్తుల స్వీకరణ మార్చి 1వ తేదీన ప్రారంభమై జూన్ 30వ తేదీతో ముగుస్తుంది. కిలోవాట్‌ల చొప్పున డెవలప్‌మెంట్ చార్జీల్లో 50 శాతం రాయితీ లభిస్తుంది.

తీరనున్న లోవోల్టేజీ సమస్య..

గృహాలు, దుకాణాలకు విద్యుత్ కనెక్షన్లు తీసుకునే సమయంలో దీపాలు, ఇతర గృహోపకరణాల విని యోగాన్ని సగటున అంచనా వేసి, లోడ్లు కిలోవాట్లలో లెక్కించి సెక్యూరిటీ డిపాజిట్, డెవల ప్‌మెంట్ చార్జీలు వేస్తారు. అధిక శాతం మంది గృ హాలకైతే 1–2 కిలోవాట్లు, దుకాణాలకు 2–3 కిలో వాట్లకు మాత్రమే అనుమతి తీసుకుంటారు. ఈ లెక్క ప్రకారమే ఆయా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తారు. పట్టణీకరణ, ఇంట్లో అవసరాలు పెరగడం, దుకాణాలకు సంబంధించి వ్యాపార లావాదేవీలు పెరగడం, వాతావరణ పరిస్థితుల వల్ల అనుమతి తీసుకున్న దానికన్నా అధికంగా విద్యుత్ వినియోగం జరుగుతోంది. వినియోగం అంచనాలకు మించడంతో నియంత్రికలపై లోడు ఎక్కువై తరచూ ట్రిప్ కావడం వల్ల లోవోల్టేజీ సమ స్యలు పెరిగిపోతున్నాయి.

గతంలో జరిమానాలు..

ఇప్పటివరకు అధిక లోడు నియంత్రణలో భాగంగా విద్యుత్ అధికారులు, సిబ్బంది తరచూ ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేసేవారు. అధిక లోడు వినియోగి స్తున్న వారిని గుర్తించి రుసుముతో పాటు జరి మానా వసూలు చేసేవారు. గత ఐదేళ్లుగా ప్రతినెలా సబ్‌స్టేషన్ పరిధిలో తమకు కేటాయించిన లక్ష్యాల మేరకు రీడింగ్‌లు తనిఖీ చేసి అధిక లోడు వినియో గిస్తున్న వారికి జరిమానా విధిస్తున్నారు.

అవకాశం సద్వినియోగం చేసుకోవాలి..

అదనపు విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు ఇచ్చిన అవకాశం సద్వినియోగం చేసుకోవాలి. అదనపు రుసుం, జరిమానా బెడద ఉండకూడదంటే తప్ప నిసరిగా క్రమబద్ధీకరణ దరఖాస్తు చేసుకోవాలి. మరో రెండు రోజులే ఉన్నందున త్వరగా దరఖాస్తు చేసుకోండి.

–కిరణ్‌కుమార్, ఏడీఈ, విజయనగరం

మత్స్య, కూర్మావతారాల్లో జగన్నాథస్వామి



రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా విజయనగరంలోని కోళ్లబజారులో కొలువైన జగన్నాథస్వామిని శనివారం మత్స్య, కూర్మావతారాల్లో అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. ఈ మేరకు ప్రత్యేకాలంకరణలో కొలువుదీరిన బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామిని భక్తులు దర్శించు కుని, ప్రత్యేక పూజలు చేశారు. –విజయనగరం టౌన్

కల్వర్టు బాగు చేయండి



విశాఖపట్నం–శ్రీకాకుళం జాతీయ రహదారిలోని ఆర్.ముంగినాపల్లి వద్ద ఉన్న కల్వర్టు పూర్తిగా పాడైంది. దీంతో ఆ దారిలో వచ్చే వారంతా తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం కల్వర్టు కిందికి కుంగిపోయి కూలిపోయే దశలో ఉంది. ఈ మేరకు ఆ దారిలో రాకపోకలు నిషేధమని పోలీసులు బోర్డు ఏర్పాటు చేశారు. ఇదే రోడ్డు మీదుగా నిత్యం కొన్ని వందలాది మంది ప్రజలు ప్రయాణిస్తుం టారు. ఈ నేపథ్యంలో పాత కల్వర్టు బాగుచేయాలని లేకుంటే కొత్త కల్వర్టు అయినా నిర్మిం చాలని స్థానికులు కోరుతున్నారు. –డెంకాడ

గొప్ప రాజనీతిజ్ఞుడు పీవీ నరసింహారావు



పీవీ నరసింహారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా పౌర వేదిక ప్రతినిధులు

విజయనగరం గంటస్తంభం: మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు..గొప్ప రాజనీతిజ్ఞుడు అని జిల్లా పౌరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కొనియా డారు. నగరంలోని జిల్లా పౌర వేదిక కార్యాలయం లో పీవీ నరసింహారావు జయంతి శనివారం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన పీవీ చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనం తరం ప్రధానిగా దేశానికి పీవీ అందించిన సేవలను గుర్తు చేశారు. తత్వవేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరొందిన పీవీ నరసింహారావు అనేక సంస్కరణ లతో దేశాన్ని ప్రగతిబాట పట్టించి, ప్రపంచ పటం లో నిలిపారన్నారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సమావేశంలో పౌర వేదిక ప్రతి నిధులు జలంత్రి రామచంద్రరాజు, రామ్‌మోహన్, గోపి, తిరుపతిరావు, కొండబాబు, స్వాతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి కార్యాలయంపై దాడి జరిగితే ఎందుకు స్పందించలేదు?

నెల్లిమర్ల రూరల్: తెలంగాణ రాష్ట్రంలోని ఓ మీడియా సంస్థపై దాడి జరిగితే స్పందించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌లు..సొంత రాష్ట్రంలోని సాక్షి మీడియా కార్యాలయాలపై దాడులు జరిగితే ఎందుకు స్పందించలేదని వైఎ స్సార్ సీపీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీను ఓ ప్రకటనలో శనివారం ప్రశ్నించారు. వారి అనుకూల మీడియాకో న్యాయం.. వారికి అనుకూ లంగా లేని మీడియాకో న్యాయమా అని నిలదీశారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలు, అధికార పార్టీ నాయకుల అక్రమాలు తెలియపరిచే సాక్షి మీడియాపై దాడులు చేసినప్పుడు ప్రజాస్వామ్యం, భావప్రకటనా స్వేచ్ఛ గుర్తుకు రాలేదా అని ధ్వజమె త్తారు. ఏ మీడియాపై దాడి జరిగినా ఇలానే స్పం దిస్తే బాగుంటుందని, ఒక మీడియాకి ఒకలా.. మరో మీడియాకి మరోలా స్పందిస్తేనే తమరి స్టాం డ్‌పై జనానికి అనుమానం వస్తుందన్నారు. ఇప్పటికై నా ఈ పక్షపాత వైఖరి వీడాలని హితవు పలికారు.

తాగునీరు కలుషితం కాకుండా చర్యలు



పైపులైన్ లీకేజీ మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

విజయనగరం: తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపడుతున్నామని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. నగరంలోని పలు ప్రాం తాల్లో పైపులైన్ లీకేజీలు అరికట్టే చర్యలను సిబ్బంది శనివారం చేపట్టారు. బొడ్డువారి జంక్షన్, కొత్త అగ్ర హారం, సంతపేట, రాజారావు మేడ, గాజులరే గలోని గుబేల్‌పేట ప్రాంతాల్లో పైపులైన్ లీకేజీ మర మ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టారు. అలాగే పాల్‌నగర్‌లోని సంపును శుభ్రపరిచారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున భూగర్భజలం మారుతుందని, అందరూ కాచివడ పోసిన నీటిని తాగాలన్నారు. నీటిని వృథా చేయ వద్దని, రక్షిత మంచినీటి పథకాలు, తాగునీటి ట్యాం కుల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలని తెలిపారు.

వార్డు సచివాలయ కార్యదర్శుల బదిలీలు పూర్తి



బదిలీ ప్రక్రియ చేపడుతున్న కార్పొరేషన్ అధికారులు

విజయనగరం: జిల్లా కేంద్రంలో రెండు రోజులుగా చేపడుతున్న వార్డు సచివాలయ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ శనివారంతో పూర్తయింది. మున్సి పల్ కార్పొరేషన్ కార్యాలయంలో విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, నెల్లిమర్ల, సాలూరు మున్సిపాలిటీలు సహా నగర పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న సచివాలయ కార్యదర్శులకు బదిలీలు చేయగా, రెండో రోజైన శనివారం ఒకేచోట ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న వార్డు ఎమి నిటీస్, ప్లానింగ్ కార్యదర్శులకు బదిలీలు చేశారు. కమిషనర్ పల్లి నల్లనయ్య సమక్షంలో ఈ బదిలీ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. కార్యక్రమంలో నెల్లిమర్ల కమిషనర్ ఎ.తారకనాథ్, బొబ్బిలి కమిష నర్ రామలక్ష్మి, పార్వతీపురం కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, సాలూరు మేనేజర్ బీఎం శివప్రసాద్, విజయనగరం కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, ఏఏవో సీతారామ్మూర్తి తదిత రులు పాల్గొన్నారు.

ఐదేళ్లు దాటిన బాలలు బడిలో ఉండాలి

- ఇంటింటా సర్వే ద్వారా బాలలను గుర్తించాలి
- ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచాలి
- కలెక్టరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టరు బీఆర్ అంబేడ్కర్, ఇతర అధికారులు

విజయనగరం అర్బన్: ఐదేళ్ల వయసు నిండిన బాల బాలికలందరినీ బడిలో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. ఇదే విషయమై కలెక్టరే ట్‌లోని తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారు లతో కలెక్టరు శనివారం సమావేశయ్యారు. ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు(అడ్మిషన్లు), సార్వత్రిక విద్య వంటి అంశాలపై అధికారులకు కలెక్టరు దిశానిర్దేశం చేశారు. అనంతరం పాఠశాలల్లో ప్రవే శాలకు సంబంధించి రూపొందించిన వాల్‌పోస్టర్లు విడుదల చేసి, కాసేపు మాట్లాడారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు సంఖ్య పెరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. దీనికోసం ప్రత్యేకంగా ఇంటింటా సర్వే, క్యాంపెయిన్, ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టాలని ఆదే శించారు. ఆగస్టు 31వ తేదీ నాటికి బడి వయసు పిల్లలంతా బడిలోనే ఉండాలన్నారు. అంగన్‌వా డీల్లో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న వారి గుర్చి సమాచారం విద్యాశాఖకు అందివ్వాలని ఆ శాఖ అధికారులకు కలెక్టరు తెలిపారు. ముఖ్యంగా తల్లి దండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు ప్రభుత్వం ద్వారా కలుగుతున్న ప్రయోజనాలను వివరించాలన్నారు. ప్రవేశాల పర్యవేక్షణకు జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. మధ్యలో బడి మానేసిన పిల్లలను బడిలో చేర్పించాలన్నారు.

సార్వత్రిక విద్యతో చదువు కొనసాగింపు..

ఇంతవరకు చదువుకోని వారు, చదువు మధ్యలో మానివేసిన వారికి విద్యనందించే సార్వత్రిక విద్యాపీఠంలో ప్రవేశాల సంఖ్యను పెంచాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పదో తరగతి ఫెయిలైన, బడి మధ్యలో మానేసిన 14 సంవత్సరాల వయసు పైబ డిన వారిని గుర్తించాలని, అలాగే పదో తరగతి పాసైన వారికి ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు గాను ఓపెన్ స్కూలు ద్వారా అవకాశాలు కలిగేలా చూడా లన్నారు. మహిళలు, ప్రైవేట్ రంగంలో పనిచేసే ఉద్యోగులు, వృత్తి, వ్యాపార రంగాలు, ఉపాధి హామీ పథకం కూలీలు, అంగన్‌వాడీ, ఆశ కార్య కర్తలు, ఏఎన్ఎంలంతా సార్వత్రిక విద్యావిధానం ద్వారా చదువు కొనసాగించాలని, గొప్ప విద్యార్హ తలు సాధించాలని ఆకాంక్షించారు. సమావేశంలో డీఈవో యు.మాణిక్యంనాయుడు, జెడ్పీ సీఈవో బీవీ సత్యనారాయణ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారిణి అన్నపూర్ణ, డ్వామా పీడీ శారదాదేవి, డీఎంహెచ్‌వో డాక్టర్ జీవనరాణి, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ రామారావు, ఓపెన్ స్కూల్ కన్వీనర్ సన్యాసిరాజు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులు విద్యాభ్యాసానికి దూరం కారాదు

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకరరావు



మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకరరావు

విజయనగరం అర్బన్: ఉపాధ్యాయులు లేక అరకు మండలం లోతేరు పంచాయతీ పరిధిలోని వంతుల గుడ, తోడుబంద, ఈడారి, దంసానివలస, బొరకాలవలస, లండిగుడ, కాగువలస, తదితర పాఠశా లలు ఇప్పటికీ తెరుచుకోలేదన్న వార్తలపై రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు స్పందించారు. మీడియాతో శనివారం మాట్లా డుతూ సంబంధిత అధికారులు గిరిజన విద్యార్థులు విద్యావకాశాలను కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన గ్రామాల్లోని బడి ఈడు పిల్లలందరూ విద్యన భ్యసించేలా చూడాలన్నారు. ఆయా గ్రామాల్లో విద్యార్థుల పాఠశాల విద్యపై క్షేత్రస్థాయిలో విద్యాశాఖ అధికారులు దృష్టి సారించాలని కోరారు. ఇప్పటికే పాఠశాలలు ప్రారంభమై నందున విద్యార్థులు పాఠశాలలకు వచ్చి చదు వుకునేలా చూడాలన్నారు.

జూలై 4న ఇంటర్వ్యూలు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశా లలో ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధించిన ఇంట ర్వ్యూలు జూలై 4వ తేదీన నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.పద్మలీల ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. కేర్ టేకర్ రెండు పోస్టులు, ఆఫీస్ అసిస్టెంట్ ఒక పోస్టులతో పాటు ప్లంబరు కమ్ ఎలక్ట్రీషియన్ పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థులంతా ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఉన్న స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, బయోడేటా, పాన్‌కార్డు, కుల ధ్రువీకరణపత్రం వెంట తీసుకురావాలన్నారు.

'సీతం' అధ్యాపకులకు ప్రశంసలు



అధ్యాపకురాలిని అభినందిస్తున్న సీతం కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులకు ఆసియా కార్బన్ బిల్డింగ్ ట్రాన్సిషన్ కార్యక్రమంలో ప్రశంసలు లభించినట్లు ఆ కళాశాల డైరెక్టర్ ఎం.శశిభూషణరావు తెలిపారు. విశాఖపట్నంలో ఇటీవల ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్(ఐజీబీసీ), విశాఖ లోకల్ చాప్టర్ ఆధ్వర్యం లో రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల సివిల్ ఇంజినీరింగ్ అధ్యాపకులు ఎం.భా ర్గవి, కె.గాయత్రికిరణ్‌లు పర్యావరణ అనుకూల నిర్మాణ విధానాలు, కార్బన్ ఉద్గారాల తగ్గింపు, నెట్ జీరో లక్ష్యాల సాధనపై ప్రసంగించినందుకు గాను ఆ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, నిర్వా హకుల నుంచి అభినందలు దక్కాయన్నారు. ఈ మేరకు శనివారం కళాశాలలో సదరు అధ్యాపకు లను అభినందించి, సన్మానించారు.

వైభవంగా రథయాత్ర



ప్రత్యేకాలంకరణలో జగన్నాథస్వామి

జగన్నాథ స్వామి రథ యాత్ర మహోత్స వాలు అంగ రంగ వైభ వంగా విజ యనగరం జిల్లా కేం ద్రంలో నిర్వహిస్తు న్నారు. గం టస్తంభం వద్ద దోమల మందిరం వద్ద జరిగిన రెండో రోజు(శనివారం) యాత్రకు జనం పోటెత్తారు. ప్రత్యేకాలంకర ణలో దర్శనమిచ్చిన బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బం దులు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం